# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని ఈరోజు ఉదయం రాష్ట్రానికి చేరుకున్నారు.**
2. **రాష్ట్రంలో జూన్ 4 వ తేదిన ఓట్ల లెక్కింపు జరుగనున్న క్రమంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర పోలీసు శాఖ తెలిపింది.**
3. **రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలకు 21 విభాగాల్లో 380 పోస్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.**
4. **గోదావరి డెల్టాలో ఖరీఫ్ పంటల సాగుకు ఈ రోజు నుంచి నీటిని విడుదల చేసినట్లు డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్. సతీష్ కుమార్ తెలిపారు.**
5. **హనుమాన్ జన్మదినోత్సవాన్ని ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

==========================

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని ఈరోజు ఉదయం రాష్ట్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయం వద్ద ముఖ్యమంత్రికి పలువురు రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ముఖ్యమంత్రి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు.

-------------------------

రాష్ట్రంలో జూన్ 4 వ తేదిన ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గత మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 579 ప్రదేశాల్లో నిర్వహించిన కార్డెన్- సెర్చ్ సోదాల్లో భాగంగా 374 లీటర్ల అక్రమ మద్యం, 1,400 లీటర్ల సారాను జప్తు చేశామని, సరైన పత్రాలు లేని 3,524 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసు శాఖ పేర్కొంది.

-------------------------

గోదావరి డెల్టా ప్రాంతంలో ఖరీఫ్ పంటల సాగుకు ఈ రోజు నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేసినట్లు గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్. సతీష్ కుమార్ తెలిపారు. ఖరీఫ్‌లో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువల పరిధిలోని 10 లక్షల 13 వేల 161 ఎకరాలకు నీటిని విడుదల చేశామన్నారు. తూర్పు డెల్టాలోని కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో 2 లక్షల 81 వేల 303 ఎకరాలకు,

మధ్య డెల్టాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాలోని 2 లక్షల 18 వందల 96 ఎకరాలకు పశ్చిమ డెల్టాలో పశ్చిమ గోదావరిలోని 5 లక్షల 29 వేల 962 ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు 21 విభాగాల్లో 380 పోస్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 విద్య సంవత్సరంలో పాడేరు, పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోనిలలో కళాశాలలను ప్రారంభించనున్నారని. ఈ క్రమంలో జాతీయ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, బోధనా సిబ్బందిని అందుబాటులో ఉంచడంలో భాగంగా 380 పోస్టులను మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తగా మంజూరు చేసిన ఈ పోస్టుల్లో 60 ప్రొఫెసర్, 85 అసోసియేట్ ప్రొఫెసర్, 75 అసి స్టెంట్ ప్రొఫెసర్, 160 ట్యూటర్ పోస్టులు వాటిలో ఉన్నాయని తెలిపారు.

---------------------------

విజయవాడలో అతిసార వ్యాధి అదుపులోనే ఉందని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. విజయవాడ మొగల్రాజపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో అతిసార వ్యాధి పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొగల్రాజపురం పరిధిలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడంతోపాటు ప్రజలను కలిసి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నామని అన్నారు. వైద్య బృందాలు 230 ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించాయని కొత్త కేసులు నమోదు కాలేదని చెప్పారు. అతిసార లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స చేయడానికి వైద్య శిబిరం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సురక్షిత మంచినీటి వాడకం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారని చెప్పారు.

---------------------------

ఖరీఫ్ సీజన్‌లో తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 77 వేల 817 హెక్టార్లలో రైతులు వరి సాగు చేపట్టనున్నారని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. రాజమహేంద్రవరం గ్రామీణ మండలం తొర్రేడు గ్రామంలోని వరి నారుమళ్లను నిన్న ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ, భూసారాన్ని పెంపొందించేందుకు పశువుల ఎరువుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ కు అవసరమయ్యే 23 వేల 96 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

---------------------------

సంపూర్ణ ఆహారంగా పాలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని వైద్యులు తెలిపారు. ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని ఇండియన్ డెయిరీ అసోసియేషన్, డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు లింగుట్ల రమేష్ ఆకాశవాణితో మాట్లాడుతూ పాలలో కాల్షియం సమృద్ధిగా ఉంటుందని ఇవి శరీరాన్ని దృఢంగా చేసేందుకు సహాయపడుతుందన్నారు. పాడి పరిశ్రమకు సంబంధించిన కార్యకలాపాలను ప్రోత్సహించడమే పాల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

---------------------------

హనుమత్ జయంతి పర్వదినాన్ని ప్రజలు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. హనుమాన్ ఆలయాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శనం చేసుకుంటున్నారు. హనుమాన్ చాలీసా, రామనామ జపం వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. తిరుమలలో ఈ రోజు నుంచి 5వ తేదీ వరకు హనుమాన్ జయంతి నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఎన్టీఆర్ జిల్లా పరిటాలలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి సందర్భంగా పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. అనంతపురం జిల్లాలోని నెంటికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

---------------------------

విద్యార్థులు, యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. అనకాపల్లి జిల్లా స్థానిక గవరపాలెం గ్రంథాలయంలో 'కేరీర్ గైడెన్స్-భవిష్యత్' అంశంపై నిన్న జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలని, జీవనోపాధి పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. లక్ష్య సాధనకు కృషి చేసేందుకు గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. ఆర్టీసీ, రైల్వే స్టేషన్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో భక్తుల పేరిట స్వామి వార్లకు నిర్వహించే వివిధ రకాల ఆన్‌లైన్ పరోక్ష సేవల టికెట్ల అమ్మకాలకు సంబంధించి సర్వదేవస్థానం హిందూ చారిటబుల్ ట్రస్టుకు అనుమతిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ టికెట్ల అమ్మకాలు దేవదాయ శాఖ ప్రత్యేక వెబ్సైట్ ద్వారా జరిగేవి. అయితే, వీలైనంత ఎక్కువ మందికి ఆలయాల సేవలు అందుబాటులోకి తేవడంతోపాటు, ఎక్కువ ప్రచారం కల్పించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

---------------------------

గిరిజనులు పండ్ల తోటల సాగు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర గిరిజన ప్రాజెక్ట్ మేనేజర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా శివపురం గూడెంలో గిరిజనులు సాగు చేసిన మామిడి తోటలను శ్రీశైలం ఐటీడీఏ పీఓ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డితో కలసి నిన్న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకంతో ఆర్థికంగా రాణించవచ్చునన్నారు. పండ్లతోటలలో అంతర పంటలను సాగు చేసుచేసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని చెప్పారు. అంతర పంటలను సాగుచేసుకొనే గిరిజన రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఒక ఎకరాకు ప్రధానమంత్రి వందన్ పథకం ద్వారా 10 మొక్కలను ఇస్తుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 38 సెకన్లు...

=====================